# తెగిన వీణ

"అసలు ఏ మనిషికైనా ఇన్ని బాధలుండడానిక్కారణం ఏవిటను కుంటున్నావ్?" అన్నారు మావారు ఓనాడు తీరిగ్గా.

హామ్మో!

నా గురించి ఆలోచించడానికే నాకు టైము చాలడం లేదు. ఇంక ఈ జనరలైజేషన్స్ కూడానా?!

అంచేత నేనేం మాట్లాడలేదు.

ఓ చిన్న చిరునవ్వుతో కూడిన చూపొకటి విసిరి మళ్ళీ టి.వి. వేపు చూస్తూ కూర్చున్నాను.

"అయినా నా వెర్రిగాని ఇలాంటి ప్రశ్న నిన్నడగడం ఏవిటి? నీది ఒట్టి పిచ్చిక బ్రైను. పాపం! నీ తప్పూ లేదు. నువ్వు మాత్రం ఏం చేస్తావు? మీ బాబు పోలిక వచ్చింది మరి. ఆఫ్‌కోర్స్. ఆడపిల్లకి తండ్రిపోలిక రావడం అదృష్టవేఁ అనుకో. కానీ కట్టుకున్న వాడికి దురదృష్టం. నీతో వచ్చిన చిక్కేవిఁటంటే ఎవరెన్ని ప్రశ్నలడిగినా నువ్వు మాత్రం నోరు మెదపవు. తమాషా ఏవిఁటంటే అడిగిన వాడిక్కూడా ఆ ప్రశ్న జ్ఞాపకం ఉండదు...ఇంతకీ ఏ మనిషికైనా బాధలక్కారణం ఏవిఁటో నేను చెప్తాను వినుకో...ఏవిఁటా చూపు? వీడి మొహం. వీడికేం తెలుసనా!

అదే...అదే...నన్ను ఇర్రిటేట్ చేస్తుంది.

ప్రపంచం అంతా నా అంత జీనియస్ లేడంటారు – (నాయనా నరసింగరావు. నువ్వు నాకు మాత్రమే మొగుడివి. ప్రపంచానిక్కాదు) – నువ్వు మాత్రం నన్ను ఓ చచ్చిన బొద్దింకను చూసినట్టు చూస్తావు. అయినా నాకు తెలీకడుగుతానూ – (తెలీకేం ఖర్మ. నీకు అన్నీ

తెలుసు) – నేనంటే నీకెందుకే అంత జెలసీ?" అన్నారు పేపరు జాగ్రత్తగా మడుస్తూ.

మరే, నా బతుక్కి అదొక్కటే తక్కువ.

ఈసారి చిరునవ్వు కాదు కదా ఏ నవ్వూ పిసరంత కూడా విసరలేదు.

మావారి వాక్ప్రవాహం సింగిల్ట్రాక్ మీద సూపర్ ఎక్స్ప్రెస్ లాంటిది.

ఝూమ్మని వెళ్ళిపోతుంది.

"అసలు పాయింట్. కారణం ఏవిఁటంటే temptations అనగా కోరికలు. మాట వరసకి...నీకు పట్టుచీర కొనుక్కోవాలన్న కోరిక ఉంద నుకో...ఊరికే మాటవరసకేలే...కొనుక్కోలేదు...అప్పుడు...అయ్యో... కొను క్కోలేకపోయానే అన్న బాధ. అలా ప్రతీ కోరిక ఒక బాధే! ఏదో నాలాంటి ఋషీశ్వరులకి ఏం ఉండవనుకో. అంచేత ఏతా వాతా చెప్పొచ్చేదేఁవిఁటంటే కోరికల్ని చంపుకోవాలే సుందరమ్మ తల్లీ. మరి నీ కింత జ్ఞానోదయం కలిగించేనా? నాకో మాంచికప్పు కాఫీ ఇచ్చుకో. మాంచి కప్పుకాదు. కాఫీ?" అన్నారు సిగరెట్ పొగలోకి చూస్తూ.

ఆ సిగరెట్ ఫారెన్ది.

యాష్ట్రే కూడా ఫారెన్దే.

"సిగరెట్ కాల్చడం కోరిక కాదా స్వామీ?" అంటేనో!

"సిగరెట్ కోరిక కాదు. వ్యసనం" అంటారు.

నాకు తెగ నవ్వొచ్చింది.

ఆ నవ్వు ఖరీదు నాలుగ్గంటల లెక్చరు.

కాబట్టి నవ్వలేదు.

"చూశేరా! మనస్ఫూర్తిగా నవ్వాలన్న అతి చిన్న కోరిక్కూడా తీరలేదు" అంటేనో.

"నీ మొహం, నువ్వూ కోరిక్కాదు. ఇన్స్టింక్ట్" అంటారేమో.

'ఏమో ఏఁవిఁటి?' అంటారు.

నా మొగుడి సంగతి నాకు తెలీదా!

ఇంతకీ – నా అదృష్టమో, మావారి ఉపదేశాల ప్రభావమో,

పూర్వజన్మ సుకృతమో, పరిస్థితుల ప్రభావమో తెలీదు కాని నాకే కోరికలూ లేవు. గొప్ప కాదు. నిజం.

అయితే ఈ మధ్య నాకు తెలీకుండానే అతి చిన్న కోరిక - చాలా చిన్నది - చిన్నగా మొలకెత్తింది. అది చిగురు వెయ్యకుండా, వేళ్ళు పారకుండా బోనసాయ్ మొక్కలా అలాగే ఉంచేను.

అయినా ఆ బుజ్జిముండ అప్పుడప్పుడు నా గుండెలో కలుక్కుమంటూ ఉంటుంది.

నిజానికి ఆ కోరిక తీరడానికి నాకేం ఖర్చు అవదు. కష్టమూ లేదు.

మరైతే ఎందుకు తీరడం లేదు?

అదంతే!

ఇంతకీ ఏమాకోరిక?

ఏదైనా పుస్తకాల షాపులో నేనున్నప్పుడు, ఎవరైనా "బీనాదేవిగారి పుస్తకాలున్నాయా?" అనడిగితే వినాలి.

ఔను! నవ్వుతారని తెలుసు.

ఎంకి పాటలో చెప్పినట్టు 'నవ్వి పోదురుగాక. నాకేటి సిగ్గు'. ఇంతకీ అదేవంత సిగ్గు పడవలసిన విషయం అని నేననుకోను.

ఈ అతి చిన్న కోరిక తీరకుండానే చచ్చిపోతానో ఏఁవిఁటో? పోనీలే. ఏం చేస్తాం.

చచ్చిన తరవాత దెయ్యవై, పుస్తకాల షాపుల చుట్టూ తిరుగుతాను.

అద్భుతాలు ఎప్పుడూ అనుకోకుండానే జరుగుతాయి.

ఆ వేళ ... రైల్వేస్టేషన్లో...

నేనెక్కాల్సిన రైలు జీవితకాలం లేటు కాదు కాని పావుగంట లేటన్నారు. అంటే రైల్వే కాలమానం ప్రకారం గంటన్నమాట.

తమాషా ఏఁవిఁటంటే ఇంటి నుండి ఫోను చేస్తే కరక్టు టైము అన్నారు.

రైల్వే వారి లీలలు దైవలీలలు.

ఇంతకీ ఈ గంట ఏం చెయ్యాలి?

హిగిన్ ↔ బాదమ్స్ ↔ దగ్గర సెటిలయ్యాను.

పావుగంటే గడిచిందో, గంటే గడిచిందో తెలీదుగాని, నేనెక్కాల్సిన రైలు వస్తున్నట్టు మూడు భాషల్లోనూ ఎనౌన్స్ చేశేరుట. అయితే నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు. (నాకా మూడు భాషలూ వచ్చు).

రైలు వస్తోందన్న వార్త పోర్టరు చెప్పేడు.

అదిగో...సరిగ్గా...అప్పుడు వినిపించింది.

వెయ్యి వీణలు ఒక్కసారి మీటినట్టు.

కోటి కోయిలలు ఒక్కసారి కూసినట్టు.

"బీనాదేవిగారి పుస్తకాలున్నాయా?"

అంతే!

ఒక్క క్షణంలో సగం.

గుండెలో గులాబీలు పూశేయి.

మనసులో మల్లెలు విరిశేయి.

పన్నీటి జలపాతం.

పారిజాతాల పరిమళం.

నాగమల్లి పువ్వుల నాట్యం.

ఇంత ఆనందవాఁ?

ఆనందం ఇంత అందంగా ఉంటుందా!

వెనక్కి తిరిగేను.

పాతికేళ్ళవాడు.

పైజామా, లాల్చీ వాడు

నల్లనివాడు.

పద్మనయనంబులవాడు.

నా వెనకే నిల్చున్నాడు.

ఏదీ!! మరొక్కమారు...

అడగనే అడిగేడు. షాపువాడు మొదటి సారి వినలేదు.

నా జన్మ ధన్యమైంది.

మరింక ఈ రైలుకి ఏక్సిడెంటైనా నేనీ అవతారం చాలించేసినా మరేం ఫరవాలేదు!

'కాస్తే కాంతా, కాస్తే పుత్ర' అని భజగోవిందంలో చెప్పినట్టు "ఎవరు నీ వారు?"

ఛస్తే రెండ్రోజులేడుస్తారు. మూడోనాడు మరిచిపోతారు.

పాపం! మావారే - కాఫీ ఇచ్చే దిక్కులేక కట కట లాడిపోతారు.

నేను గాలిలో నడిచి కంపార్టుమెంటులోకి వెళ్ళేను. కిటికీలోంచి చూస్తే అతను కనిపించలేదు.

ట్రైను కదిలింది.

ఫ్లాట్‌ఫారం కనిపించినంతవరకు అలా చూస్తూనే ఉన్నాను. ఎలా వచ్చేడో అలా మాయమైపోయేడు.

పురాణకాలంలో దేవుఁడు మనిషి రూపంలో వచ్చి భక్తుల కోరిక తీర్చి మాయమయ్యేవాడట.

కాని ఇది పురాణ కాలం కాదు.

నాకు భక్తి లేదు.

ఆలోచిస్తూ తల తిప్పేను.

అతను నా సీటు పక్కనే నిల్చున్నాడు.

పాపం! రిజర్వేషను లేనట్టుంది.

పోనీ. నా సీటు ఇచ్చేస్తే?

అలనాడు కన్నప్ప దేవుఁడికి కళ్ళు ఇవ్వలేదూ?

అయినా ఆడవాళ్ళు నిల్చుంటే మొగాడు సీటు ఆఫర్ చెయ్యడం రివాజు కాని మొగాడికి ఆడది సీటు ఆఫర్ చెయ్యడం బావుండదు. ఇంతకీ ఆ రివాజు ఒకప్పుడు. ఇప్పుడు ఈ సమాన హక్కుల పోరాటంలో ఆ రివాజు పోయింది. ఆ పోరాటంలో ఒక భాగంగా "మీరూ నిలబడడం నేర్చుకోండి" అంటున్నారు.

ట్రైను కదిలింది.

ఎవరో దిగేరు. ఆ సీటులో అతను కూర్చున్నాడు. అప్పుడు తాపీగా సిగరెట్ వెలిగించేడు. నా హేండ్‌బేగ్‌లో డబ్బున్నా లేకపోయినా, సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె మాత్రం విధిగా ఉంటాయి - మావారు, గార్డు జెండా ఊపుతున్నప్పుడు, ట్రైన్ కూత కూసినప్పుడు, "సిగరెట్ కొనుక్కొస్తానుండు" అని పరిగెత్తడం, నాకు టెన్షన్, బి.పి. పెరిగిపోవడం,

"వై డుయు గెట్ పేనికీ" అని మావారి తిట్లు – ఇవన్నీ పడలేక ఎమర్జన్సీ స్టాకు పెట్టుకుంటాను. నా దగ్గరున్నది ఫారెన్ సరుకు.

ఇతనికొకటి ఆఫర్ చేస్తే?

సిల్లీగా ఉంటుంది.

నేను ఆడదాన్నవడం వల్ల ఎన్ని డ్రాబేక్‌లున్నాయి.

సిగరెట్ వెలిగిస్తే గాని మూడ్ రాదేమో!

అప్పుడు తెరిచేడు పుస్తకం.

నా ఎదురుగా నా పుస్తకం మరొకరు చదువుతున్నప్పుడు, వాళ్ళ ఫీలింగ్సు నేను చదవడం అదొక థ్రిల్.

అతను ఇంకా పేజీ తిప్పలేదు.

"నాకు సిగరెట్ వాసన పడదండీ" అంది పక్కనున్న పదహారేళ్ల పిల్ల.

ఎంత సుకుమారవేఁ నా తల్లీ.

నీకు చైన్ స్మోకరు మొగుడొస్తాడు.

ఇది శాపం కాదు. జీవిత సత్యం.

అయినా ఈ కాలం పిల్లలకి బొత్తిగా మర్యాద, మన్నన లేవు.

పాపం! అతనెంత ఫీలయ్యేడో.

అతను "సారీ" అని సిగరెట్ పారేసి, పుస్తకం మూసేసి బుద్ధిగా కూర్చున్నాడు.

"మీరిక్కడ కూర్చోండి. నేనక్కడ కూర్చుంటాను" అని నా కిటికీ దగ్గర సీటు ఆఫర్ చేశేను.

అప్పుడతని కళ్ళలో కనిపించిన కృతజ్ఞత రాయడానికి నా భాష చాలదు.

దీస్ స్మాల్ థింగ్స్ మేటర్ మచ్.

సీట్లు మారినతను సిగరెట్ వెలిగించేడు.

ఇంక పుస్తకం తియ్యాలి.

"ఆ పుస్తకం ఓ సారిస్తారా?" అంది ఇందాకటి సిగరెట్ వైరి.

ఈ పిల్లకి అక్కర్లేని విషయం లేదు.

అప్పుడు చూశేను ఆ పిల్లని పరీక్షగా.

తొడుక్కున్న జీన్స్ స్కర్టు తొడలవరకే ఉంది. పైగా కాలు మీద కాలేసుకొని కూర్చుంది.

జాకెట్టు మిషను మీద కుట్టలేదు. ఒంటిమీద కుట్టేసినట్టుంది.

అంత టైట్ జాకెట్టు తొడుక్కుంటే ఆ తల్లి ఏం చేస్తుందో?

చెప్పే ఉంటుంది. ఈ పిల్ల వినేరకవాఁ?

ఫాషన్లు ఒద్దనం కాని ఒళ్ళు కప్పకుంటేనే బావుంటుంది. ఈ డ్రస్సుల వల్ల అందంకంటే అవహేళన ఎక్కువ.

అందం కట్టుకున్న బట్టల్లో ఉండదు. గుణంలో ఉంటుంది. బట్టల్లో ఉండేది అందం గాదు. ఆకర్షణ మాత్రమే. ఈ సంగతి ఈ గుంటలకి ఎంత చెప్పినా బుర్రకెక్కదు.

లైక్ ఎ జెంటిల్మన్ అతనా పుస్తకం ఇచ్చేడు.

"తెలుగా? ఇంగ్లీషనుకున్నాను" అని తిరిగి ఇచ్చేసింది.

నాతల్లే. నీకు ఇంగ్లీషు నాలుగు అల్ఫబీట్లు తప్పుల్లేకుండా రాయటం వచ్చా?

కాన్వెంటు చదువులొచ్చి పిల్లల్ని ఉభయ భ్రష్టుల్ని చేశేయి.

అటు తెలుగూ రాదు. ఇటు ఇంగ్లీషూ రాదు.

ఈ పరిస్థితికి సిగ్గుపడాల్సింది తల్లిదండ్రులు.

ఎలాగైతేనేం అతను పుస్తకం తెరిచేడు.

చదువుతూ, మధ్య మధ్య కిటికీలోంచి చూస్తున్నాడు.

మనం ఏం రాసినా థాట్ ప్రొవోకింగ్‌గా ఉండాలిట.

ఈసారి ట్రైన్ ఆగినప్పుడు కాఫీ ఆఫర్ చేస్తేనో?

ఛ! ఛ!! ఏవనుకుంటాడో.

నేను ఫలానా అని చెప్తే?

ఆశ్చర్యపోతాడేమో.

నా ఆలోచనలు ఆగకుండానే ట్రైన్ ఆగింది. అతను దిగేడు.

కాఫీ కోసం అనుకున్నాను.

ట్రైను కదుల్తోంది.

అతను ఎక్కలేదు.

పుస్తకం సీటు మీదే ఉంది.

నేను కిటికీ దగ్గరకెళ్ళి "మీ పుస్తకం." అంటూ అందించబోయేను.

"అంత దరిద్రం కథలు నేనింతవరకు చదవలేదు. కావాలంటే మీరు తీసుకోండి. లేకపోతే అక్కడే వదిలేయండి" అంటున్న అతని మాటలు రైలు శబ్దంలో కలిసిపోయేయి.

కథల్లో దరిద్రవాఁ?

కథలే దరిద్రవాఁ??

వెయ్యి వీణలూ ఠప్మని విరిగి పోయేయి.

కోటి కోయిలలూ చచ్చిపోయేయి.

మల్లెలు మాడి మసైపోయేయి.

పన్నీటి జలపాతం కన్నీరైంది.

ఔను. కోరిక చంపుకోవాలి.

కాదు. కోరిక చచ్చిపోయింది.

*('రచన' మాసపత్రిక డిశంబరు, 1994)*

★ ★ ★